క్లుప్తంగా

శాకాంబరిగా పెద్దమ్మ తల్లి



శాకాంబరిదేవి అలంకారంలో పెద్దమ్మ తల్లి

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం పంచాయతీ హౌసింగ్‌ బోర్డులో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆషాఢ మాసం మూడో ఆదివారం పెద్దమ్మ తల్లి శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో పెద్దమ్మ తల్లిని అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి కాయకర్పూరం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బస్‌ షెల్టర్‌ నిర్మాణానికి రూ. 14 లక్షలు మంజూరు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్యే ఎస్‌.రఘురామిరెడ్డి తన కోటా నిధుల నుంచి రూ. 14 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండు రోజులలో టెండర్‌ పూర్తి అయ్యితే మఠం నుంచి మల్లేపల్లె రోడ్డులో బస్‌షెల్టర్‌ ఏర్పాటు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వీరబ్రహ్మేంద్ర స్వామి పేరుతో బస్‌ డిపోకూడా ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే బి.మఠంలో మూడు చోట్ల స్థలం కూడా రెవెన్యూ, ఆర్టీసీ అధికారులు పరిశీలించారన్నారు.

నేడు సోమాపురంలో వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని సోమాపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్‌ కాన్సెప్ట్‌ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్‌ కుమార్‌ తెలిపారు. గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు గ్రామంలో 104 వాహనంతో పాటు గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

ఆటో యూనియన్‌ నూతన కమిటీ

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆవరణలో ఆదివారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మండల ఆటో యూనియన్‌ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌, ఉపాధ్యక్షులుగా దానం, చిన్నప్ప, విజయభాస్కర్‌, ప్రసాద్‌, రమణ, గాబ్రియేలు, సహాయ కార్యదర్శులుగా గురప్ప, రాజేష్‌కుమార్‌, పుష్పరాజు, చిన్న భాస్కర్‌, శ్యామ్‌లతో పాటు మరో 30 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భైరవప్రసాద్‌ మాట్లాడుతూ మండలంలో దాదాపు 500 ఆటోలు ఉన్నాయని ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పోలీసులు గుర్తింపుకార్డులు ఇవ్వాలని, కోరారు.

వెంకటశివారెడ్డికి స్పోర్ట్స్‌లో గౌరవ డాక్టరేట్‌



కడప స్పోర్ట్స్‌ : కడప నగరం ఎన్‌జీఓ కాలనీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ, ఆంధ్రా క్రికెట్‌ సంఘం సీఈఓ ఎం. వెంకటశివారెడ్డికి యూఎస్‌కి చెందిన జేబీఆర్‌ హార్వర్డ్‌ విశ్వవిద్యాలయం అక్రిడేషన్‌ జారీచేసిన సెయింట్‌ మదర్‌ థెరిసా యూనివర్సిటీ, (ఆస్ట్రేలియా) క్రీడల్లో గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆగస్టు 5వ తేదీన మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో నిర్వహించే కాన్వొకేషన్‌ వేడుకల్లో ఈయనకు గౌరవ డాక్టరేట్‌ ప్రదానం చేయనున్నారు. ఈయన క్రీడారంగానికి చేసిన కృషిని గుర్తించి డాక్టరేట్‌ ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. కాగా జిల్లాకు చెందిన వెంకటశివారెడ్డికి క్రీడల్లో గౌరవ డాక్టరేట్‌ లభించడం పట్ల వైవీయూ ఆర్ట్స్‌ విభాగం డీన్‌ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి అభినందనలు తెలిపారు. పలువురు క్రీడాసంఘ ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

కడప కార్పొరేషన్‌ : మున్సిపల్‌ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే అరెస్ట్‌ నోటీసులివ్వడం దారుణమని ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ నగర అధ్యక్షుడు ఎస్‌. రవి అన్నారు. ఆదివారం ఆయనకు అరెస్ట్‌ నోటీసు ఇచ్చిన సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్‌ కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, జీతాలు పెంచమని కూడా అడగడం లేదన్నారు.

ఖరీఫ్‌ మురిసే..!



టంగుటూరు గ్రామ సమీపంలో సాగులో ఉన్న మొక్క జొన్న పంట

ఖరీఫ్‌ సీజన్‌లో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు మొక్కజొన్న, మినుము, మిరప పంటలను సాగు చేశారు. గతంలో పదునైన వాన పడటంతో రైతులు విత్తనాలు వేశారు. అనంతరం బోర్ల ద్వారా పంటలకు నీటి తడులు అందిస్తూ అప్పుడప్పుడూ క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తున్నారు.

రాజుపాళెం



రాజుపాళెం గ్రామంలో సాగులో ఉన్న మినుము పంట

శాంతిని పెంపొందించడమే మానవత లక్ష్యం

జమ్మలమడుగు : సమాజంలో శాంతిని పెంపొందించడమే మానవత స్వచ్ఛంద సంస్థ ప్రధాన ఉద్దేశమని మానవతా సేవాసంస్థ కేంద్ర కమిటీ సభ్యుడు రాటాల గోపి అన్నారు. ఆదివారం జమ్మలమడుగు పట్టణంలోని ఎస్పీ డిగ్రీకాలేజి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవతా సంస్థ ద్వారా సమాజంలో వైద్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడంతపాటు మరణించిన వారి కోసం బాడీ ఫ్రీజర్లు, శాంతిరథాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మానవత నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా మస్తాన్‌రెడ్డి, కార్యదర్శిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా మహేశ్వరరెడ్డి, వనం గురుకుమార్‌, అక్రమ్‌ హుస్సేన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యకరమంలో సుధాకర్‌ గుప్తా, మాధవరెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువు

బద్వేలు అర్బన్‌ : భగవద్గీత బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువు అని త్రైతసిద్ధాంత హిందూ జ్ఞానవేదిక – ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు జీ.ప్రసాద్‌ తెలిపారు. త్రైతసిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని శివరామనగర్‌, కొంగలవీడు, ఎల్లుగారిపల్లె, జోగిరెడ్డిగారిపల్లె, కొత్తచెరువు గ్రామాల్లో ఆదివారం త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి పలువురికి భగవద్గీత పుస్తకాలు అందజేసి మాట్లాడారు. ఆదిగురువుగా శ్రీకృష్ణుని జీవన విధానం లోకానికి ఒక ప్రామాణికమని అన్నారు. ధర్మం విలువ తెలుపుటకు, ధర్మం పక్షాన నిలబడేందుకు వయో పరిమితి అడ్డు కాదని చాటిన ధర్మశీలి శ్రీకృష్ణుడు



కొత్తచెరువు గ్రామంలో భగవద్గీత పుస్తకాలను అందజేస్తున్న త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

అని అన్నారు. భగవద్గీతను పఠించడంతో పాటు అందులోని బోధనలను పాటించడం ద్వారా సుఖ శాంతులతో పాటు సంస్కారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత హిందూ జ్ఞానవేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గానుగపెంటకు ఆత్మీయ సత్కారం

గోపవరం : ప్రముఖ సాహితీవేత్త, మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్‌ డాక్టర్‌ గానుగపెంట హనుమంతరావును కడప సీపీ బ్రౌన్‌ పరిశోధన కేంద్రంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. లలిత కళానికేతన్‌ సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేసిన 'మల్లిఖార్జునీయం' పుస్తకావిష్కరణ సభలో హనుమంతరావును మైదుకూరు శాసన సభ్యులు శెట్టిపల్లె రఘురామిరెడ్డి, అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్‌ ఛాన్సలర్‌ ఆచార్య రామకృష్ణారెడ్డి, యోగివేమన యూనివర్సిటీ వైస్‌ ఛాన్సలర్‌ ఆచార్య చింతాసుధాకర్‌లు సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ఆచార్య



హనుమంతరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తదితరులు

మూలమల్లికార్జునరెడ్డి, జింకా సుబ్రమణ్యం, అనపర్తి పిచ్చయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతో సాధించిన బంగారు పతకాలు

పోరుమామిళ్ల : మండలంలోని అక్కలరెడ్డిపల్లె చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్‌ పోటీలలో ఆల్‌రౌండ్‌ ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల అడ్మినిస్టేటర్‌ సుధారాణి తెలిపారు. కలసపాడు ఎస్‌.కె. విద్యాసంస్థల 5వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో సీఎస్‌ఆర్‌ఎం పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపరచారన్నారు.

శనివారం సాయంత్రం ముగింపు వేడుకల్లో విద్యార్థులకు షీల్డ్‌ అందచేశారన్నారు. ఆదివారం పాఠశాలలో కప్‌ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు



కప్‌తో విద్యార్థులు

డాక్టర్‌ గీత, చిత్తా తోమాస్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కరాటేలో కూడా మెడల్స్‌ సాధించారన్నారు. చదువుతో పాటు ఆటల్లో కూడా విద్యార్థులు రాణించడం గర్వకారణంగా ఉందన్నారు.

సులభరీతిలో గణితం బోధించాలి

కడప ఎడ్యుకేషన్‌ : గణితాన్ని విద్యార్థులకు సులభరీతిలో బోధించేందుకు గణిత ఉపాధ్యాయులు కృషి చేయాలని గణితఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అట్ల నరసింహారెడ్డి సూచించారు. ఆదివారం కడపలోని మున్సిపల్‌ హైస్కూల్‌ మెయిన్‌లో గణిత ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గణితఫోరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక స్టేట్‌ టెక్నికల్‌ కమిటీ కన్వీనర్‌ కోనా కిరణ్‌కుమార్‌రెడ్డి, పీవీ సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో గౌరవాధ్యక్షుడిగా సునీల్‌కుమార్‌, అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరరెడ్డి, కోశాధికారిగా సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగరాజు, కిషోర్‌, శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శిగా నూరుల్లా, అదనపు కార్యదర్శిగా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా సురేష్‌బాబు, సురేష్‌, మనో



సమావేశంలో మాట్లాడుతున్న గణితఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అట్ల నరసింహారెడ్డి

హరయ్య, పోల్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు డివిజన్‌ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జీవీ రమణలతోపాటు పలువురు గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

కడప స్పోర్ట్స్‌ : కడప నగరం మస్తాన్‌వలివీధిలో ఆదివారం నిర్వహించిన 18వ అష్రఫ్‌–ప్రసన్న మంత్రి రోలింగ్‌ షీల్డ్‌ చదరంగం చాంపియన్‌షిప్‌ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి బి.అనీస్‌ దర్బారీ ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 34 మంది క్రీడాకారులు పాల్గొనగా రేటింగ్‌ క్రీడాకారుడు లిఖితేశ్వరరావు చాంపియన్‌గా నిలిచాడు. రెండోస్థానంలో జాఫర్‌, మూడోస్థానంలో ఇనాక్‌, 4వ స్థానంలో ప్రణవ్‌, 5వ స్థానంలో ప్రణీత్‌, 6వ స్థానంలో రెడ్డిపవన్‌, 7వ స్థానంలో పృథ్వీరాజ్‌, 8వ స్థానంలో చిన్మయ్‌, 9వ స్థానంలో తేజోమయి,



టాప్‌-10 స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు

10వ స్థానంలో తన్మయ్‌కాంత్‌ నిలిచారు. వీరికి చీఫ్‌ ఆర్బిటర్‌ శ్రీకాంత్‌ జ్ఞాపికలు అందజేశారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్‌ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నేడు పెద్ద జొన్నవరంలో జగనన్న సురక్ష సభ

దువ్వూరు : మండలంలోని పెద్దజొన్నవరం గ్రామంలో సోమవారం ఉదయం 11 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కార్యాలయం ఏఓ బాబు తెలిపారు. కార్యక్రమంలో 11 రకాల సేవలు ప్రజలకు ఉచితంగా అందిస్తారని, దరఖాస్తుదారులకు అవసరమైన సర్టిఫికెట్లను అధికారులు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అట్లూరు : మండలంలోని కొండూరు సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్‌ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్‌ మణ్యం గంగిరెడ్డిలు తెలిపారు. మండలంలోని నాయకులు, అధికారులు హాజరుకావాలన్నారు.

రేపు చియ్యపాడులో..

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడీఓ రాధా కృష్ణవేణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు ఎవరైనా ఉంటే సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురికి వివిధ రకాలైన ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు చెన్నుపల్లెలో..

కలసపాడు : మండలంలోని చెన్నుపల్లెలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. కార్యక్రమంలో అర్హులైన వారికి అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జోనల్‌ కార్యదర్శిగా రాజశేఖర్‌



కడప అగ్రికల్చర్‌ : ఏపీ బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జోనల్‌ కార్యదర్శిగా జిల్లాకు సంబంధించి నంద్యాల రాజశేఖర్‌ జోనల్‌ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు పట్టణంలో బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 26 జిల్లాల బీసీ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో రాయలసీమకు సంబంధించి నంద్యాల రాజశేఖర్‌ను జోనల్‌ ప్రధాన కార్యదర్శిగా, నాగేషును రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, మణిని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, వరదయ్యను అన్నమయ్య జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, మహాదేవను కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు.

పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం నిర్వహించే డిగ్రీ పరీక్షకు విద్యార్థులు నిర్దేశించిన సమయంలోపు చేరుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్‌. ఈశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ నియంత్రించే అవకాశం ఉందన్నారు. అందువల్ల విద్యార్థులు నిర్ణీత సమయం కన్నా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఎగ్జిబిషన్‌ టెండర్లను రద్దు చేయాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : నగర పాలక సంస్థ ఆదాయానికి గండికొట్టే ఎగ్జిబిషన్‌ టెండర్లను రద్దు చేయాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా డిమాండ్‌ చేశారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎగ్జిబిషన్‌ టెండర్లలో పాల్గొన్న ఇద్దరు కాంట్రాక్టర్లు సిండికేట్‌ అయి గత సంవత్సరం టెండర్‌లో రూ.21 లక్షలు చెల్లిస్తే ఈ ఏడాది రూ.15 లక్షలకు తగ్గించి టెండర్లను నిర్వహించడం కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందన్నారు. నగరపాలక సంస్థ అధికారులు కాంట్రాక్టర్‌కు టెండర్‌ అగ్రిమెంట్‌ ఇవ్వకపోయినా గ్రౌండ్‌ను ఆక్రమించి ఎగ్జిబిషన్‌ సామగ్రిని దింపడం అధికారుల అలసత్వానికి నిదర్శమన్నారు. కలెక్టర్‌ జోక్యం చేసుకొని నగరపాలక సంస్థ ఆదాయం పెంచేందుకు ఉన్న వనరులపై దృష్టి పెట్టాలన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు

లింగాల : వర్షం కురవాలని కోరుతూ మండలంలోని ఎగువపల్లెలో ఆదివారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఖరీఫ్‌ సీజన్‌ పూర్తవుతున్నా ఇంతవరకు పదునుపాటి వర్షం కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురవాలని కోరుతూ గ్రామ ప్రజలు భాగవత పారాయణం, గ్రామా ల్లో రామ భజనలు నిర్వహించారు.

గాండ్ల కులస్తులు రాజకీయాల్లో రాణించాలి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : గాండ్ల కులస్తులు రాజకీయాల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య తెలిపారు. స్థానిక ఆచార్యుల కాలనీలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం గాండ్ల తెలికుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాండ్ల తెలిక కులస్తులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు విశాలాక్షి మాట్లాడుతూ గాండ్ల తెలికులు ఐకమత్యంతో ముందుకు పోవాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, బచ్చల పుల్లయ్య, విశాలాక్షిని సత్కరించారు. కార్యక్రమంలో గాండ్ల సంఘం



మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్యను సన్మానిస్తున్న గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు

పట్టణాధ్యక్షుడు నాగయ్య, ఉపాధ్యక్షుడు పుల్లయ్య, కృష్ణయ్య, సుబ్బయ్య, భాస్కర్‌, రామకృష్ణ, తులశయ్య, అంజి, రామకృష్ణ, గోపవరం రమణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సరుకులు అందజేత

బ్రహ్మంగారిమఠం : మండలంలోని దిరసవంచ పంచాయతీ రాజుపేటలో నివసించే నిరుపేద పీరుసాహెబ్‌ కుటుంబానికి ఆదివారం బద్వేలుకు చెందిన ఆరోగ్యభారత్‌ ఫౌండేషన్‌ నిర్వాకులు నిత్యావసర సరుకులు అందజేశారు. ఫౌండేషన్‌ అధ్యక్షుడు రహీమ్‌ మాట్లాడుతూ రాజుపేట నివాసి పీరుసాహెబ్‌కు పెరాలసిస్‌తో మంచానికే పరిమితమై పూట గడవడమే కష్టంగా ఉన్నట్లు తెలిసిందన్నారు. ఆ కుటుంబానికి చేయూతనివ్వాలని ఒక నెలకు సరిపడే బియ్యం, నిత్యావసర సరుకులు అందించామన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణం కల్గి పేదలు, వృద్ధులు, అనాథలకు సాయం చేయాలన్నారు. కార్యక్ర



నిరుపేద కుటుంబానికి సరుకులు అందజేస్తున్న ఆరోగ్యభారత్‌ ఫౌండేషన్‌ సభ్యులు

మంలో సంస్థ సభ్యులు రామసుబ్బారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శేఖర్‌, సుబ్బరాజు, పీరయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

పోరుమామిళ్ల : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పోరుమామిళ్లలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వివేకానంద భవన్‌ వద్ద ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అభిలాష్‌ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 1949 జులై 9న ఢిల్లీ యూనివర్శిటీలో 9 మంది విద్యార్థులతో ప్రారంభించబడిన ఏబీవీపీ ఈరోజు 40 లక్షలకు పైగా సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఉందన్నారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, సమస్యల పరిష్కారం కొరకు కృషి



జెండా ఎగురవేసిన అభిలాష్‌

చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిది

ప్రొద్దుటూరు కల్చరల్‌ : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదని ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌ హేమాంజలి పేర్కొన్నారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం లైఫ్‌స్టైల్‌ ఫర్‌ ఎన్విరాన్‌మెంట్‌ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకు పెరిగి పోతున్న కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్‌ వాడకాన్ని తగ్గించాలని, బయటకు వెళ్లే సమయంలో క్యారీబాగ్‌లను తీసుకెళ్లాలని సూచించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా జేవీవీ సమ్మర్‌ క్యాంప్‌ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. జేవీవీ పట్టణాధ్య



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

క్షుడు డాక్టర్‌ జె.శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఉషారాణి, ప్రధాన కార్యదర్శి సునీత, కళ్యాణ్‌కృష్ణ, అక్షయ, నాయకులు మధుసూదనరెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్యమాత చర్చి ఫాదర్‌కు సత్కారం

కడప కల్చరల్‌ : కడప నగరం రైల్వేస్టేషన్‌ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం సహాయ డైరెక్టర్‌ ఫాదర్‌ అనిల్‌ను శాంతి సేవ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మడగలం ప్రసాద్‌ బృందం ఘనంగా సత్కరించింది. ఆదివారం ఆ క్షేత్రంలోని ఫాదర్స్‌ కార్యాలయంలో ఆయన బదిలీ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫాదర్‌ అనిల్‌ ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో డైరెక్టర్‌గా విశ్వాసులకు ఎనలేని సేవలు అందించారని, నేడు మరో ప్రాంతంలో ఆయన సేవలు అవసరం అయ్యాయి గనుక కడప అపోస్తలిక పాలనాధికారి బిషప్‌ గాలి బాలి ఆదేశాల మేరకు టేకూరుపేట విచారణ గురువుగా నియమించారని తెలిపారు. ఆయన చర్చి అభివృద్ధి, నిర్మాణ పనుల్లో విచారణ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలను విశ్వాస పథంలో నడిపించేందుకు చేసిన సేవలను కొనియాడారు. ఫాదర్‌ అనిల్‌ మాట్లాడుతూ ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో పనిచేసే అవకాశం లభించడం



ఫాదర్‌ అనిల్‌ను సన్మానిస్తున్న శాంతి సేవా సొసైటీ ప్రతినిధులు

ఓ అరుదైన భాగ్యమని. ఇక్కడి వారంతా తనపైన చూపిన ప్రేమ, అభిమానాలకు రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో క్షేత్రం డైరెక్టర్‌ ఫాదర్‌ ఎండీ ప్రసాద్‌రావు, సహాయ డైరెక్టర్‌ ఫాదర్‌ విల్సన్‌, మదర్లు, సొసైటీ కోశాధికారి ఎలిజిబెత్‌, సహాయ కార్యదర్శి విజయ్‌ మనోహర్‌, చర్చి కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించకపోతే మరో ఉద్యమం

కడప ఎడ్యుకేషన్‌ : విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే మరో ఉద్యమం తప్పదని ఫ్యాప్టో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డిలు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం కడపలోని యూటీఎఫ్‌ భవన్‌లో ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌ మదన విజయ్‌కుమార్‌ అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్‌ చేశారు. అలాగే ఉద్యోగులకు 11వ పీఆర్‌సీతో పాటు డీఏ బకాయిలను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి,



ఫ్యాప్టో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డి

ఏపీటీఎఫ్‌ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు అబ్దుల్లా, యూటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు, హెచ్‌ఎంల సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ట్రెజరర్‌ రాజశేఖర్‌, ఏపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి నాగరాజు, బీటీఏ జిల్లా అధ్యక్షుడు హరి కొండయ్య పాల్గొన్నారు.